సాక్షి
వికారాబాద్
బుధవారం, 16, జూలై, 2025





**సీజనల్ గండం**
ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున మూగజీవాలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నాయి. 10లో▸



**ప్రభుత్వ ప్రోత్సాహం**
ప్రభుత్వం క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహిస్తోందని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. 10లో▸



**ప్లాస్టిక్ మల్చింగ్ భేష్!**
పంటల సాగులో రైతులు వినూత్న పద్ధతులు పాటించి మంచి ఫలితాలు సాధిస్తున్నారు. 11లో▸

## న్యూస్‌రీల్

### ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం



సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులు

అనంతగిరి: ఉపాధ్యాయుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం పీఆర్‌టీయూ ముందుండి పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మండల సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేదార్‌నాథ్, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, నాయకులు సతీష్‌కుమార్, రమేష్, వీరేశం, జహంగీర్, యాదగిరి, వేణు, శ్రీనివాస్, రాములు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఏఎస్పీ బదిలీ



ఏఎస్పీ హనుమంత్‌రావును సన్మానిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: జిల్లా అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న టీబీ హనుమంత్‌రావు రాచకొండ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయనకు ఆత్మీయ సన్మానం ఏర్పాటు చేశారు. ఎస్పీ నారాయణ రెడ్డి శాలువా, పూలమాలలతో ఘనంగా తస్కరించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీటీసీ ఏఎస్పీ మురళీధర్, డీఎస్పీలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

### ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు గడువు పెంపు

షాద్‌నగర్‌రూరల్: దూర విద్యావిధానంలో ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు ప్రభుత్వం గడువును పొడగించినట్లు పట్టణంలోని జియోన్ హైస్కూల్ పాఠశాల హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### 'పాలమూరు - రంగారెడ్డి'పై స్పష్టత ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

కొందుర్గు: పదేళ్ల క్రితమే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణ సర్వేకు రూ.10వేలు కోట్లు నాటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి కేటాయించారని.. నేటికీ సర్వే చేపట్టకపోవడం బాధాకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. మంగళవారం పార్టీ నాయకులు మాణిక్యరావు, అనిత ఆధ్వర్యంలో జిల్లేడ్ చౌదరిగూడ మండల సభ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జంగయ్య మాట్లాడుతూ.. ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.9 వేల కోట్ల ఖర్చుతో జూరాల బ్యాక్ వాటరుతో 73 కిలోమీటర్లు నిర్మాణం పనులు చేపడితే 12 మండలాలలోని వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్దుల జంగయ్య, మండల కార్యదర్శి వెంకటేశ్ నాయకులు యాదయ్య, భీమయ్య, పద్మ, లక్ష్మి, రాములు, లింగమయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కబ్జాలు.. దందాలు

జిల్లాలో చెరువులు, కుంటలు, దారులను యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. పంట కాల్వలను కబ్జా చేసి పొలాల్లో కలిపేసుకుంటున్నారు. అనుమతులు లేకుండా రిసార్ట్స్ నిర్వహించడమే కాకుండా సమీప ప్రాజెక్టుల్లో అక్రమ బోటింగ్ చేస్తూ లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు. పడవ ప్రమాదాల్లో ప్రజల ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

- అనుమతులు లేకుండా రిసార్ట్స్‌ల నిర్వహణ
- ప్రాజెక్టుల్లో అక్రమ బోటింగ్
- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- పట్టించుకోని అధికారులు

## యథేచ్ఛగా చెరువులు, కుంటలు, దారుల ఆక్రమణ



వికారాబాద్ మండలం సర్పన్‌పల్లి ప్రాజెక్టు బఫర్ జోన్‌లో పానాదిని మూసేసి చేపట్టిన నిర్మాణాలు

వికారాబాద్: అనుమతులు లేకుండా రిసార్ట్స్‌ను నిర్వహించడమే కాకుండా ప్రాజెక్టు(చెరువులు, కుంటలు)ల్లో అక్రమ బోటింగ్ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇటీవల వికారాబాద్ సమీపంలోని సర్పన్‌పల్లి ప్రాజెక్టులో పడవ బోల్తా పడి ఇద్దరు మహిళలు మృత్యువాత పడటం చర్చనీయాంశమయింది. ఈ ఘటనతో అనేక కొత్త విషయాలు వెలుగు చూశాయి. చెరువులో అక్రమ బోటింగ్ తోపాటు బఫర్ జోన్‌ను ఆక్రమించారు. పశువులు నీళ్లు తాగేందుకు వెళ్లే పానాదిని కూడా వదల్లేదు. దారిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. అసైన్డ్ భూమిలో నిర్మాణాలు చేపట్టడం, చెరువులోకి స్థానికులెవరూ రాకుండా అడ్డుకోవడం లాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఈ విషయాలు వెలుగులోకి రావడంతో కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో కమిటీ వేసి విచారణకు ఆదేశించారు. వివరాలు సేకరించిన అధికారులు వాటిని బహిర్గతం చేయలేదు. చర్యలు తీసుకున్న దాఖలాలు కూడా కనిపించలేదు. విచారణ పారదర్శకంగా జరగకుండా కొన్ని శక్తులు ప్రభావితం చూపుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి ఘటనలు ఒక్క సర్పన్‌పల్లి ప్రాజెక్టులోనే కాదు జిల్లా వ్యాప్తంగా చోటుచేసుకుంటున్నాయి. చాలా మండలాల్లో చెరువులు, కుంటలు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి.

**చూసీచూడనట్లుగా..**

జిల్లాలో చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నాయి. అక్రమార్కుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ఇటీవల కాలంలో భూముల ధరలు అమాంతం పెరిగిపోవడంతో కబ్జా రాయుళ్ల కన్ను చెరువులు, కుంటలు, నాలాలు, వాగులు, దారులపై పడింది. కొన్ని చోట్ల చెరువులు, కుంటలను ఆక్రమించి పొలాల్లో కలిపేసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల కబ్జా చేసిన భూములను అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాకుండా చెరువులను అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మార్చేస్తున్నారు. అధికారులకు అన్ని విషయాలు తెలిసినా విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారు.

**రికార్డులు తారుమారు**

జిల్లాలో మొత్తం 1,196 చెరువులు ఉన్నాయి. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం కింద చెరువులు, కుంటల్లో పూడిక తీత పనులు చేట్టింది. ఈ సమయంలో ఎక్కడైనా ఆక్రమణలు జరిగినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశాలు జారీ చేసింది. అప్పట్లో నీటి పారుదల శాఖ అధికారులు కేవలం పూడిక తీత పనులతోనే సరిపెట్టారు. కబ్జాల జోలికి వెళ్లలేదు. హద్దులు ఏర్పాటు చేయడంపై దృష్టి సారించలేదు. తదనంతర కాలంలో ఆక్రమణలు మరింత పెరిగాయి. చెరువులు, కుంటలు, దారులు, పానాదులు, నాలాల రికార్డులు తరుమారయ్యాయి. రెవెన్యూ, నీటిపారుదల శాఖల వద్ద చాలా చెరువులకు సంబంధించిన రికార్డులు కనిపించడంలేదు. కంచే చేను మేసిన చందంగా అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

### ఆక్రమణలు మచ్చుకు కొన్ని..

- వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శివసాగర్ చెరువు ఆక్రమణకు గురైంది. నాలుగు వైపులా కబ్జాలకు గురవుతోంది. కొందరు బడా బాబులు ఫాంహౌస్‌లు నిర్మిస్తున్నారు. మరికొందరు చెరువు చివరి భాగాన్ని పూడ్చి వేసి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు.
- ఇదే మున్సిపల్ పరిధిలోని కొత్తగడి సమీపంలోని కొంపల్లి చెరువు పరిస్థితి కూడా ఇలాగే తయారైంది. చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు.
- జిల్లా కేంద్రానికి అనుకొని ఉన్న సర్పన్‌పల్లి ప్రాజెక్టుదీ ఇదే పరిస్థితి. కొందరు వ్యాపారులు బఫర్ జోన్‌తో పాటు చెరువును పూర్తిగా కబ్జా చేశారు. వ్యాపార కార్యకలాపాలకు వినియోగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చెరువు స్థలంలో కాటేజీలు నిర్మించి అద్దెకు ఇస్తున్నారు.
- పరిగి మున్సిపల్ పరిధిలోని కొత్త చెరువు పూర్తిగా కబ్జాకు గురైంది. ఫీడర్ చానల్‌ను దారిమళ్లించి చెరువులోకి నీరు రాకుండా చేశారు. తూములను ధ్వంసం చేశారు. కట్టను సైతం వదలలేదు. దీన్ని ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయిస్తునారు.
- పరిగి పట్టణ పరిధిలోని పల్లవి కళాశాల వెనుక గల మరో చెరువు కూడా పూర్తిగా ఆక్రమణకు గురైంది.
- తాండూరు మున్సిపల్ పరిధిలోని గొల్ల చెరువు సగానికి పైగా ఆక్రమించారు.
- తాజాగా ధారూరు మండలం అల్లాపూర్ వద్ద పోతుల వాగును ఓ వ్యక్తి ఆక్రమించి తన పొలంలో కలుపుకొన్నాడు. దాదాపు 30 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు అధికారులు తేల్చారు. దీంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీరు కాగ్నా నదిలో కలిసే పరిస్థితి లేకుండా పోయింది.



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

# పింఛను మొత్తం పెంచాల్సిందే

- వచ్చేనెల నుంచి అమలు చేసి తీరాలి
- చేతకాకపోతే సీఎం గద్దె దిగాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

అనంతగిరి: ఎన్నికల హామీ మేరకు ఆగస్టు నెల నుంచి ఆసరా, చేయూత పెన్షన్ల మొత్తం పెంచాలని, లేకుంటే సీఎం రేవంత్‌రెడ్డి గద్దె దిగాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని సత్యభారతి ఫంక్షన్ హాల్‌లో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి, చేయూత పెన్షన్ దారుల సంఘం ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షన్ మొత్తం పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చాక హామీని అమలు చేయకపోవడం సరికాదన్నారు. అధికార, ప్రతిపక్షాలకు విమర్శించుకోవడం తప్ప ప్రజల బాధలు పట్టడం లేదన్నారు. దివ్యాంగుల పెన్షన్ మొత్తాన్ని రూ.6 వేలకు, వృద్ధులు, వితంతువుల పెన్షన్‌ను రూ.4వేలకు, కండరాల క్షీణతతో బాధపడుతున్న వారికి రూ.15వేలు ఇవ్వాలనే డిమాండ్‌తో ఆగస్టు 13న హైదరాబాద్‌లో లక్షలాది మందితో మహా ధర్నా చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఎవ్వరికీ అవసరం లేని అందాల పోటీలు నిర్వహించడానికి ప్రభుత్వం వద్ద నిధులు ఉంటాయి కానీ.. పెన్షన్ మొత్తం పెంచడానికి ఎందుకు ఉండవని ప్రశ్నించారు. నాలుగేళ్ల నుంచి వితంతువులు, వృద్ధులు కొత్త పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, జిల్లా అధ్యక్షుడు శ్యాంప్రసాద్, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు పీ ఆనంద్ మాదిగ, జిల్లా ఇన్‌చార్జ్ ప్రశాంత్ మాదిగ, చేయూత పెన్షన్ల జిల్లా కమిటీ అధ్యక్షురాలు మంజుల, మహిళా నాయకురాళ్లు పద్మమ్మ పుష్ప, సునీ త, ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్, ప్రధాన కార్యదర్శి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుకుందాం

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్ నాయక్
- విద్యార్థులకు ఉపన్యాస పోటీలు



మాట్లాడుతున్న శంకర్ నాయక్

తాండూరు టౌన్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మేరా యువ భారత్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు చెట్లు మానవాళికి ఎలా ఉపయోగపడతాయి అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం శంకర్ నాయక్ మాట్లాడుతూ.. పలు కాలుష్య కారకాల వల్ల పర్యావరణం కలుషితమవుతోందన్నారు. భూగోళంపై ఆక్సిజన్ శాతం పెరగాలంటే చెట్లు విపరీతంగా విస్తరించాలన్నారు. ఇందుకు విధిగా ప్రతి ఒక్కరూ ఏక్ పేడ్ మాకే నామ్ పర్ అనే నినాదంతో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. భవిష్యత్‌లో కాలుష్య వాతావరణాన్ని తగ్గించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఉపన్యాస పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మెమెంటో తోపాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువ జన విభాగం అధికారి అంజయ్య, అధ్యాపకులు వెంకటస్వామి, విద్యా సాగర్, వెంకన్న, జి వెంకట స్వామి, గోవర్ధన్, రమ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు అండగా భరోసా కేంద్రం

- ఎస్పీ నారాయణరెడ్డి
- బాధితులకు మరింత మెరుగైన సేవలందించాలని సూచన

అనంతగిరి: మహిళలకు అండగా జిల్లా భరోసా కేంద్రం పని చేస్తోందని ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా పోలీస్ కేంద్రంలోని భరోసా కేంద్రం వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కేంద్రం అందిస్తున్న సేవలను కొనియాడారు. బాధితులకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కేంద్రం మహిళలు, పిల్లలకు అండగా నిలుస్తోందన్నారు. గృహ హింస, లైంగిక వేధింపులు, ఇతర సమస్యలతో బాధపడుతున్న వారికి అన్ని విధాలా సహాయం అందిస్తోందని తెలిపారు. బాధితులకు న్యాయం అందించడంలోనూ, వారికి మానసిక ధైర్యాన్ని ఇవ్వడంలోనూ ఇక్కడి సిబ్బంది పాత్ర అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు హనుమంత్ రావు, మురళీధర్, డీఎస్పీలు, భరోసా కేంద్రం సమన్వయకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

**పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి**

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం వికారాబాద్‌లోని తన కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. తద్వారా బాధితులకు సత్వర న్యాయం అందుతుందని, న్యాయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ టీవీల ఏర్పాటును వేగవంతం చేయాలన్నారు. నిరంతరం వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు మురళీధర్, టీబీ హనుమంత్‌రావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో పని చేయండి

- ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో దిశా కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అనంతగిరి: అధికారులు సమన్వయంతో పనిచేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు అందేలా చూడాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దిశ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, బ్యాంకర్లు, పంచాయతీ రాజ్, శిశు సంక్షేమం, పౌర సరఫరాలు, పరిశ్రమలు, పశు సంవర్ధక, వెటర్నరీ, మిషన్ భగీరథ, నేషనల్ హైవే, గృహ నిర్మాణం, మార్కెటింగ్, అటవీ, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ శాఖలు చేపట్టిన పనులపై సమీక్ష చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్యాంకర్లు లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద నర్సరీలు, మొక్కల పెంపకం తదితర పనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 3,815 మందికి వృద్ధాప్య, వితంతు తదితర పెన్షన్లు అందజేస్తున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం 1.60 లక్షల మంది రైతులకు పీఎం కిసాన్ పథకం కింద రూ.490 కోట్లు అందజేయడం జరిగిందన్నారు. ప్రస్తుత సీజన్‌కు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. పొలాల్లో మట్టి నమూనాల సేకరించి సాయిల్ హెల్త్ కార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. జాతీయ వైద్య కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఆర్‌డీఏ శ్రీనివాస్, దిశ కమిటీ సభ్యులు అంతారం లలిత, మిట్ట పరమేశ్వర్ రెడ్డి, వడ్ల నందు, జానకిరామ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**సమాజాన్ని మార్చే శక్తి మీడియాకే ఉంది**

సమాజాన్ని మార్చే శక్తి మీడియాకే ఉందని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని అంబేడ్కర్ భవన్‌లో కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వార్తలపై మీడియా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతికూల వార్తలతోనే కాకుండా సానుకూల వార్తలతో కూడా సమాజంలో మార్పు తీసుకురావచ్చన్నారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా మీడియా పాత్ర ఉండాలన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, పీఐబీ డిప్యూటీ డైరెక్టర్ మానస కృష్ణ కాంత్, పీఐబీ ఏడీజీ శృతి పాటిల్, ఎం అండ్ సీఓ శివచరణ్, సీడీఏసీ ప్రాజెక్ట్ మేనేజర్ జగదీష్ బాబు, ఎస్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు విద్యాధర్, శ్రీహరి, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# గురుకులాలకు నాణ్యతలేని సన్నబియ్యం



పాఠశాల సమస్యలపై ఎస్ఓ సునీతతో చర్చిస్తున్న రాజశేఖర్ రెడ్డి తదితరులు

- అన్నంలో పురుగులు
- ఇది ప్రభుత్వ తప్పిదమే
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

మర్పల్లి: ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలకు నాణ్యత లేని సన్నబియ్యం సరఫరా చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఆరోపించారు. తరచూ అన్నంలో పురుగులు వస్తున్నాయని, విద్యార్థులు తినలేకపోతున్నారని తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో భోజనం సరిగ్గా లేదని విద్యార్థులు ఆందోళన చేశారు. ఈ క్రమంలో మండల అధికారులు విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థినులను సముదాయించారు. ఈ విషయం తెలుసుకున్న రాజశేఖర్‌రెడ్డి పార్టీ మండల అధ్యక్షుడు పట్లోళ్ల రామేశ్వర్‌తో కలిసి మంగళవారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులకు అందుతున్న భోజనంపై ఆరా తీశారు. అనంతరం ఎస్ఓ సునీతతో మాట్లాడారు. పాఠశాలకు సన్న బియ్యం సరఫరా కాకపోవడంతో ఐదు రోజుల క్రితం మోమిన్‌పేట్ మండలంలోని వసతి గృహం నుంచి రెండు బస్తాల బియ్యం తెచ్చుకున్నట్లు సునీత తెలిపారు. అవి నాణ్యత లేవని తెలిపారు. పురుగులు వచ్చినట్లు ఒకరిద్దరు విద్యార్థులు తమ దృష్టికి తెచ్చారన్నారు. అనంతరం రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ తప్పిదమే అన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఇకపై విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి మల్లేశ్ యాదవ్, జిల్లా, మండల నాయకులు బలరాంగౌడ్, యాదవరెడ్డి, శ్రీమంత్‌కుమార్, మధు, శేఖర్, సంగమేశ్వర్, రమేష్, శ్రీకాంత్, మహేందర్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భయం గుప్పిట్లో కాలనీలు

- కొడంగల్‌లోని మొచ్చగేరి, కుమ్మరిగేరికి పొంచి ఉన్న ముంపు ముప్పు
- భారీ వర్షాలు కురిస్తే ఇబ్బందులే
- రెండేళ్ల క్రితం తీవ్ర నష్టం

కొడంగల్: పట్టణంలోని బాలాజీనగర్ సమీపంలో గల మొచ్చగేరి, కుమ్మరిగేరి ప్రజలు భయం గుప్పి ట్లో కాలం గడుపుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే ఈ రెండు కాలనీల్లోకి వరద నీరు వచ్చే అవకాశం ఉంది. రెండేళ్ల క్రితం అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు తీరని నష్టం జరిగింది. పట్టణ శివారులో చెరువు ఉంది. ఈ చెరువుకు ఉన్న పాటు కాలువ ముచ్చగేరి, కుమ్మరిగేరికి సమీపంలో ఉంది. పాటు కాలువ పొంగి ప్రవహించినా లేక తెగిపోయినా ఈ కాలనీలు మునుగుతాయి. రెండేళ్ల క్రితం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. 93.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కొడంగల్ పెద్ద చెరువు పాటు కాలువ పొంగి ప్రవహించింది. దీంతో ఈ కాలనీల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. నిద్రలో ఉన్న ప్రజలు అర్ధరాత్రి వేళ ఏం చేయాలో తోచక బిత్తరపోయారు. ఇళ్లలోంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. బియ్యం, నిత్యావసర సరుకులతో పాటు టీవీ, ఫ్రిజ్, బీరువా, మంచాలు నీటిలో మునిగాయి. ఇండ్లలో ఉన్న సామగ్రి మొత్తం నీట మునిగింది. బాధితులు కన్నీరు మున్నీరుగా రోదించారు. విషయం తెలుసుకున్న అప్పటి మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలు బాధితులను పరామర్శించారు. మున్సిపల్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. జేసీబీలు తెప్పించి రోడ్డును తవ్వించారు. వరద నీరు వెళ్లడానికి దారి కల్పించారు. చాలా సేపటి తర్వాత వరద నీరు తగ్గుముఖం పట్టింది. కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగించే కుమ్మరి, మొచ్చ కులస్తులకు రక్షణ కల్పించాలి. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు ప్రభుత్వం అండగా ఉండాలని స్థానికులు కోరుతున్నారు.



ఇళ్లలోకి వరద నీరు చేరడంతో వస్తువులను జాగ్రత్త చేసుకుంటున్న జనం (ఫైల్)

## క్లుప్తంగా

### కాలనీల సమస్యలు పరిష్కరించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

**తాండూరు టౌన్:** పట్టణ శివారులోని 8వ వార్డు పరిధిలో గల రాజీవ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో నెలకొని ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా కాలనీవాసులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. రెండు కాలనీలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధికి మాత్రం నోచుకోలేక పోయాయన్నారు. కాలనీల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువ వ్యవస్థ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి కాలనీల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు.

### సిట్ విచారణకు హాజరు



విచారణ అనంతరం బయటకు వస్తున్న థారాసింగ్

**తాండూరు:** పీసీసీ ప్రధాన కార్యదర్శి థారాసింగ్ జాదవ్ మంగళవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా ఉన్న తన ఫోన్‌ను గత ప్రభుత్వ హయాంలో ట్యాప్ చేసి ఉంటారని పోలీసులకు తెలిపారు. సిట్ అధికారులు ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేసినట్లు వెల్లడించారు.

### అందుబాటులో అన్ని ఎరువులు

ఏడీఏ రుద్రమూర్తి



**తాండూరు రూరల్:** నియోజకవర్గంలో ఎరువుల కొరత లేదని వ్యవసాయశాఖ తాండూరు ఏడీఏ రుద్రమూర్తి అన్నారు. మంగళవారం మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడీఏ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 0మాట్లాడుతూ.. ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్, డీసీఎంఎస్, మన గ్రోమార్ దుకాణాల్లో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. వివిధ మండలాల్లో యూరియా అందుబాటులో ఉందన్నారు. పెద్దేముల్-58 మెట్రిక్ టన్నులు, బషీరాబాద్-125, తాండూరు-162, యాలాల్లో-93 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. యూరియా ఒక్క బస్తాకు రూ.267 మాత్రమే చెల్లించాలని రైతులకు సూచించారు. 90 మెట్రిక్ టన్నుల డీఏపీ కూడా అందుబాటులో ఉందన్నారు. బస్తా డీఏపీకి రూ.1,350 మాత్రమే చెల్లించాలని చెప్పారు. వర్షాకాలం సీజన్‌లో నియోజకవర్గంలో 1.52 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారన్నారు.

### పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

టీపీఎస్ఏ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్



డీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

**ఇబ్రహీంపట్నం:** గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని టీపీఎస్ఏ(తెలంగాణ పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం రాజేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా రెగ్యులర్ చేయబడిన కార్యదర్శులకు మొదటి నియామకమైన 2019 ఏప్రిల్ 11 నుంచి వర్తింపులోకి వచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని, జిల్లాలో ఓపీఎస్ క్యాటగిరీలో విధులు నిర్వహిస్తున్న వారిని జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా కన్వర్షన్ చేయాలని, పెండింగ్ జీతభత్యములు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు దేవేందర్, దీపిక, నయీం, గౌస్, నవీన్ యాదవ్, శ్రీనివాస్, సురేందర్ పాల్గొన్నారు.

### జీజేసీ ప్రిన్సిపాల్‌గా రమణకుమారి

**దుద్యాల్:** మండల పరిధిలోని హకీంపేట్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల(జీజేసీ) ప్రిన్సిపాల్‌గా రమణకుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి ఇన్నాళ్లుగా ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పని చేస్తానని అన్నారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తానన్నారు.

# పశువులకు సీజనల్ గండం



ఎక్కచెరువుతండాలో జీవాలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

- వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- ముందస్తు టీకాలు వేయిస్తే కట్టడి
- పశువైద్యాధికారుల సూచన

**కొడంగల్ రూరల్:** వర్షాకాలంలో చిరుజల్లులు, చిత్తడి నేలలు పాడి పశువుల్లో పలు రోగాలకు కారణమవుతాయి. కలుషిత నీరు, ముసిరే వర్షం, ఈగలు, దోమలు, పచ్చిక అనారోగ్యానికి దారి తీస్తాయని పశువైద్యాధికారులు చెబుతున్నారు. వానాకాలంలో పశుపోషకులు కొంతమేర జాగ్రత్తలు పాటించడంతో మూగజీవాలు ఆరోగ్యంగా ఉంటాయని పేర్కొంటున్నారు.

**పశువులకు సోకే వ్యాధులు**

వర్షాకాలంలో పశువులకు గాలికుంటువ్యాధి, గొంతువాపు వ్యాధి, నీలినాలుక, పీపీఆర్, అమ్మోరు, చిటుకు వ్యాధులు సోకుతుంటాయి.

**గాలికుంటువ్యాధి:**

ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు గాలికుంటువ్యాధి సోకుతుంది. దీని లక్షణం పశువుల నోటి నుంచి చొంగ కారుతుంది. పశువులకు ఉష్ణోగ్రత 104 నుంచి 106 డిగ్రీల వరకు ఉంటుంది. నోటిలో పుండ్లు ఏర్పడి మేత సరిగ్గా తినక నీరసంగా ఉంటాయి. పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. దూడల్లో ఇలాంటి లక్షణాలు కనిపించగానే వెంటనే పశు వైద్యులను సంప్రదించాలి.

**నివారణ చర్యలు:**

వ్యాధి నిరోధక టీకాను 6 నుంచి 8 వారాల పైబడిన దూడలకు మొదటి మోతాదు వేయాలి. 4 నుంచి 6 నెలల వయసు కలిగిన దూడలకు బూస్టర్ మోతాదు ఇప్పించాలి. టీకాను ప్రతీ ఏడాది ఇప్పిస్తే వ్యాధిని నివారించేందుకు అవకాశం ఉంటుంది. వ్యాధి సోకిన పశువును మంద నుంచి వేరు చేయాలని, పశువుల కొట్టంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి.

**నీలి నాలుక వ్యాధి:**

వ్యాధి సోకిన సమయంలో జ్వరం, నోటిలో పుండ్లు, నావికారంధ్రం, కాళ్ల గిట్టలు, నాలుక భాగంలో శోథం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. పశువుల నాలుక వాచిపోయి నీలిరంగుగా మారుతుంది. న్యూమోనియా లక్షణాలు కనిపిస్తూ శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటుంది. ముక్కు నుంచి జిగురు లాంటి ద్రవం కారుతుంది. కాలిగిట్టల దగ్గర ఎర్రగా వాచడం, మెడ భాగంలో వాపుగా ఉండడం, ముక్కు, కంటి, నోటి నుంచి తరచూ లాలజలం కారుతుంది.

**నివారణ చర్యలు:**

పశువులను వైద్యుడి దగ్గరకు తీసుకెళ్లి చికిత్స అందించాలి. ఐదు రోజులపాటు యాంటీ బయాటిక్ టీకాలు వేయించాలి. సులభంగా జీర్ణమయ్యే గంజి, ఓఆర్ఎస్ వంటి ద్రావణాన్ని అందించాలి. దోమలు రాకుండా తెరలు వాడాలి.

**అమ్మోరు:**

మేకలు, గొర్రెల్లో ప్రాణాంతకమైన అంటువ్యాధి. జ్వరం, చర్మంపై బొబ్బలు ఏర్పడి శరీరం అంతా వ్యాపిస్తుంది. చూడి గొర్రెల్లో గర్భస్రావం అవుతుంది. ఆహారం, నీరు తీసుకోకుండా నీరసించిపోతాయి.

**నివారణ:**

వ్యాధి సోకిన వాటిని మంద నుంచి వేరుచేయాలి. మూడు నెలలు నిండిన గొర్రెలకు షీప్‌ప్యాక్స్ వ్యాక్సిన్ ఇస్తే వ్యాధి రాకుండా నివారించవచ్చు. ఒకసారి టీకా ఇప్పించడంతో మూడేళ్లవరకు వ్యాధి రాకుండా ఉంటుంది.

**చిటుకు వ్యాధి:**

మేకలు గొర్రెల్లో వచ్చే ప్రాణాంతకమైన వ్యాధి చిటుకు. ఏడాదిలోపు గొర్రెలకు సోకుతుంది. విరోచనాలు, కండరాలు కొట్టుకోవడం, శ్వాసకోశ ఇబ్బందులు కనిపిస్తాయి.

**నివారణ చర్యలు:**

వైద్యుల సూచనలు పాటిస్తూ ఎంటిరోటాక్సెమియా వ్యాక్సిన్‌ను సమయానుకూలంగా వేయించాలి.

**జాగ్రత్తలు తప్పనిసరి**



పశువుల పెంపకంలో రైతులు జాగ్రత్తలు పాటిస్తూ పశుపోషణకు కృషి చేయాలి. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు టీకాలను ఇప్పించాలి. వైద్యుల సూచనలు పాటిస్తూ పశువుల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకోవాలి. మూగజీవాల కొట్టాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– పరమేశ్, పశువైద్యాధికారి, రావులపల్లి

## నలుగురిపై రౌడీషీట్

హత్యకేసులో పాతనేరస్తులపై ఉక్కుపాదం



సుగుణ



విజయ్



విశ్వనాథ్



శివకుమార్

**బషీరాబాద్:** పాత నేరస్తులపై బషీరాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. మండలంలో నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా హత్యాకేసుల్లో నిందితులపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తున్నారు. మండలంలో జరిగిన చోరీ కేసుల్లో అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘా పెడుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 4న జరిగిన ఓ మర్డర్ కేసులో నలుగురు పాత నేరస్తులపై మంగళవారం పోలీసులు రౌడీ షీట్ ఓపెన్ చేశారు.

**శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు**

మండంలోని నవల్గా గ్రామంలో ఈ ఏడాది ఫిబ్రవరి 4న మాల శ్యామప్ప(39) అనే వ్యక్తి గేటు సమీపంలో దారుణ హత్యకు గురయ్యాడు. ఈ హత్యను సొంత వదిన మాల సుగుణ సుపారీ ఇచ్చి హత్య చేయడంతో ఆమెపై పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేశారు. హత్యలో ప్రత్యేక్షంగా పాల్గొన్న కొత్త విజయ్, విశ్వనాథ్, శివకుమార్ అనే నిందితులపై కూడా షీట్ ఓపెన్ చేసినట్లు బషీరాబాద్ పోలీసులు తెలిపారు. ఎస్ఐ శంకర్ మీడియాతో మాట్లాడుతూ.. సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. నేరం చేయాలనుకునే వారి వెన్నులో వణుకు పుట్టించేలా చర్యలు తీసుకుంటామన్నారు. శ్యామప్ప హత్య కేసులో నిందితులుగా ఉన్న మాల సుగుణతో పాటు కొత్త విజయ్, విశ్వనాథ్, శివకుమార్‌లపై ఉన్నతాధికారుల ఆదేశాలతో రౌడీషీట్ తెరిచినట్లు చెప్పారు. నేరాల అదుపునకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### గిజిగాడి గూళ్లు.. మధురానుభూతి లోగిళ్లు



**దుద్యాల్:** ప్రకృతిలో పక్షుల కిలకిలారావాలు ఆస్వాదించాలని అందరూ కోరుకుంటారు. ఆ మధురమైన శబ్దాన్ని వినడానికి ఆత్రుత పడతారు. ఇలాంటి అనుభూతిని ఇవ్వడంలో గిజిగాడి ప్రాధాన్యాన్ని చెప్పనక్కర్లేదు. అలాంటి రమ్యమైన భావన ఆవిష్కృతమైంది. మండల పరిధిలోని ఆలేడ్ గ్రామ శివారులోని ఓ రైతుకు చెందిన బావి దగ్గర చెట్టుకు 20కి పైగా గిజిగాడి గుళ్లు కనువిందు చేస్తున్నాయి. వాటికి చూడటానికి స్థానికులు ఆసక్తి చూపుతున్నారు.

## క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి

**తాండూరు రూరల్:** జాతీయస్థాయి వాలీబాల్ పోటీలు తాండూరులో నిర్వహిస్తామని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జినుగుర్తిలో వాలీబాల్ క్రీడాకారుడు పి.శ్రీనివాస్ జ్ఞాపకార్థం టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. వాలీబాల్ అంటే గుర్తుకు వచ్చేది జినుగుర్తి గ్రామమని గుర్తు చేశారు. హెల్మెట్ పెట్టుకోక తన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని శ్రీనివాస్ తండ్రి రాములు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తన కొడుకు జ్ఞాపకార్థంగా 100 హెల్మెట్లను పంపిణీ చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, పురుషోత్తంరావు, సంపత్‌కుమార్, రమేశ్‌కుమార్ ఉత్తమ్‌చందు, రాంలింగారెడ్డి, ఆంజనేయులు, సాయిరెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ప్రిన్సిపాల్‌గా రోజారాణి బాధ్యతల స్వీకరణ

**బొంరాస్‌పేట:** మండలంలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బి.రోజారాణి మంగళవారం విధుల్లో చేరారు. గత ఇన్‌చార్జి పరిగి కళాశాల విజయకుమార్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. రోజారాణి ఇదివరకు సికింద్రాబాద్ వైఎంసీఏ కళాశాలలో గణిత అధ్యాపకురాలిగా ఉండగా పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రిన్సిపాల్ రోజారాణి

## విద్యార్థిని ఆత్మహత్య

- యాబాజిగూడలో ఘటన
- ఓ యువకుడిపై అనుమానం వ్యక్తంచేస్తూ తల్లి ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసులు



నవీంద్ర (ఫైల్)

**పరిగి:** పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని యాబాజిగూడలో చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోష్‌కుమార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పద్మమ్మ, జంగయ్యకు ముగ్గురు కూతుళ్లు సంతానం. 13ఏళ్ల క్రితం భర్త చనిపోవడంతో పద్మమ్మ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఇదిలా ఉండగా రెండో కూతురు నవీంద్ర (15) రంగారెడ్డి జిల్లా పాల్మాకుల కస్తూర్బాగాంధీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఇటీవల స్కూళ్లు పునఃప్రారంభం కావడంతో తల్లి పద్మమ్మ నవీంద్రను హాస్టల్‌లో వదిలి వెళ్లింది. రెండు రోజు రోజుల తర్వాత తల్లికి ఫోన్ చేసిన బాలిక తనకు చదువు ఇష్టంలేదని మారాం చేయడంతో పాటు బాగా ఏడ్చింది. దీంతో ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం స్కూల్‌కు వెళ్లమని ఎన్నిసార్లు చెప్పినా వినలేదు. దీంతో బాలికను మరో స్కూల్‌లో చేర్పించాలనే ఉద్దేశంతో టీసీ తీసుకువచ్చారు. ఇదిలా ఉండగా పద్మమ్మ గత సోమవారం ఉదయం తమ బంధువుల గ్రామమైన బస్‌పల్లికి వెళ్లింది. రాత్రి వచ్చేసరికి నవీంద్ర ఇంట్లో ఉరేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ అనే యువకుడిపై అనుమానం ఉందంటూ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు చేస్తున్నారు.

### బోరు ఏర్పాటు విషయంలో ఘర్షణ

**చేవెళ్ల:** తాగునీటి అవసరాల కోసం బోరు వేస్తున్న విషయంలో ఇరువర్గాలకు ఘర్షణ జరిగిన సంఘటన మండలంలోని నాంచేరి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ పరిధిలోని ఇంద్రారెడ్డినగర్ ప్రభుత్వ భూమిలో మంగళవారం ఉదయం మిషన్ భగీరథ అధికారులు బోరు వేయించేందుకు సిద్ధమయ్యారు. స్థానికంగా ఉండే మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్ అతని కుమారులు ఈ వ్యవహారాన్ని పర్యవేక్షిస్తున్నారు. అదే సమయంలో మాజీ సర్పంచ్ అమరేందర్‌గౌడ్ వచ్చి ఇది యూత్ భవనం కోసం కేటాయించిన స్థలంగా చెప్పి, మరో చోట బోరు వేయాలని సూచించారు. అక్కడే ఉన్న మార్కెట్ చైర్మన్ కుమారులు జైపాల్, ప్రభాకర్ గతంలో మాజీ సర్పంచ్‌తో ఉన్న మనస్పర్థల కారణంగా గొడవకు దిగారు. ఆయనపై దాడికి యత్నించారు. అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వారికి సర్ది చెప్పి పంపించారు. అమరేందర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అభివృద్ధికి ఓర్వలేకనే మాజీ సర్పంచ్ రాద్ధాంతం చేశారని మార్కెట్ చైర్మన్ పెంటయ్యగౌడ్ ఆరోపించారు.

## ఎఫ్‌టీఎల్‌లో ఆక్రమణల తొలగింపు



ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్రహరీని కూల్చుతున్న జేసీబీ

**హయత్‌నగర్:** అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కొహెడలోని పిట్టల చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలసిన ఆక్రమ నిర్మాణాలను మంగళవారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు తొలగించారు. సర్వే నంబర్ 141లోని కొంత భాగంలో చెరువు పరిధిలో ఉండగా ఎఫ్‌టీఎల్‌లోకి ప్రహరీ గోడలు వెలిశాయి. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఏఈ వంశి ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో గోడలను తొలగించారు. ఈ సందర్భంగా వంశి మాట్లాడుతూ... చెరువులు, కుంటలను రక్షించేందుకు కట్టుబడి ఉన్నామని, ఎవరైనా చెరువులను ఆక్రమించినా ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి ఉష



రైతు రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఉష

**మహేశ్వరం:** రైతులంతా ఫార్మర్ రిజిస్ట్రీ తప్పక చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి డి.ఉష సూచించారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉష మాట్లాడుతూ.. రైతులు పట్టా పాస్ బుక్, ఆధార్, ఆధార్‌కు అనుసంధానం ఉన్న ఫోన్ నంబర్‌తో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు. ప్రతీ రైతుకు 11 నంబర్లతో విశిష్ట సంఖ్య(యూనిక్ కోడ్)ని కేటాయించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. రైతు రుణాలు, ఇతర ఆర్థికసాయం పొందేందుకు ఈ నంబర్ తప్పనిసరి అని చెప్పారు. పంటలో కలుపు నివారణ, నానో యూరియా వాడే విధానం, వరి పంట సాగులో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుధారాణి, మండల వ్యవసాయాధికారి నాగమణి, టెక్నికల్ ఏఓ యాదగిరి గౌడ్, ఏటీఎం శ్రీవిద్య, విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిపై ఆందోళన చెందొద్దు



తిర్మలాపూర్‌లో టీబీ ముక్త్ అభియాన్‌లో వైద్యాధికారులు, గ్రామస్తులు

టీబీ నియంత్రణ అధికారి రవీంద్రయాదవ్

**కుల్కచర్ల:** క్షయ వ్యాధి(టీబీ) పట్ల ఎవరూ భయాందోళన చెందొద్దని జిల్లా టీబీ నియంత్రణ అధికారి రవీంద్రయాదవ్, మండల వైద్యాధికారి కిరణ్‌గౌడ్ అన్నారు. టీబీ ముక్త్ అభియాన్‌లో భాగంగా మంగళవారం తిర్మలాపూర్, ఘణపూర్, సాల్వీడు గ్రామాల్లో టీబీ, రక్తపోటు, హెచ్ఐవీ, మధుమేహం వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వచ్ఛతను పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవడంతో అనారోగ్య పరిస్థితులు తగ్గుతాయన్నారు. ఎవరూ కూడా వ్యాధుల పట్ల భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల రోగాలకు చికిత్స ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరిశ్వర్ రెడ్డి, వైద్య సిబ్బంది యాదమ్మ, రాజు, గోపాల్, గౌరీబాయి, తదితరులు పాల్గొన్నారు.

# సస్యరక్షణే ముఖ్యం

- జామ పంటలో నులిపురుగుల బెడద
- ముందస్తు చర్యలతో కట్టడి చేయవచ్చు
- కృషి విజ్ఞాన కేంద్రం క్రిడా నిపుణుడు శ్రీకృష్ణ



**కందుకూరు:** పండ్ల తోటల్లో మామిడి తర్వాత అధికంగా సాగు చేసేది జామ పంట. నికరాదాయంతో పాటు ఏడాదికి రెండుసార్లు దిగుబడి వస్తుండటంతో రైతులు జామ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల పరిధిలో దాదాపు 15,800 ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుతం జామ సాగులో ఉంది. కాకపోతే విదేశాల నుంచి తెచ్చిన తైవాన్ రకం జామ ద్వారా దేశంలోకి నులి పురుగుల బెడద తీవ్రతరం అయింది. దీంతో తైవాన్ రకంతో పాటు దేశీయ రకాలైన అలహాబాద్ సఫేదీ, లక్నో-49 తదితర రకాలకు నులి పురుగులు ఆశించి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నులి పురుగులు వేర్లను ఆశించడంతో చెట్టు ఎండిపోయి చనిపోతుంది. లక్షణాలు గుర్తించక నీళ్లు పెట్టడం, అధికంగా ఎరువులు వేయడంతో ఉపయోగం ఉండటంలేదని కృషి విజ్ఞాన కేంద్రం క్రిడా నిపుణుడు జి.శ్రీకృష్ణ తెలిపారు. నులి పురుగుల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన సస్యరక్షణ చర్యలను గురించి ఆయన రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు.

**లక్షణాలు**

- ఆకులు పసుపు రంగులోకి మారడం.
- కొమ్మలు, లేత చిగుర్లు వడలిపోవడం, నులి పురుగులు ఆశించిన తొలి దశలో భూమిలో తగినంత తేమ ఉన్నా మొక్కలు వాడిపోయి కన్పిస్తాయి.
- చెట్టు ఎదుగుదల లోపించడం, చెట్టు మోడు భారడం.
- పూత, పిందె రాలడం లేదా ఆలస్యం అవడం, వచ్చినా త్వరగా రాలిపోవడం.
- నీరు, ఎరువులు అందించినా మొక్క కోలుకోకపోవడం.
- ఈ లక్షణాలు అన్నీ ఎండు తెగులు లక్షణాలు పోలి ఉండటం.
- వేర్లు ముడులు ముడులుగా మారి, బుడిపెలని కలిగి ఉండటం, వేరు వ్యవస్థ క్షీణించి ఉండటం.
- నులి పురుగులు సోకిన వేరు భాగాల్లో ఎండు తెగులు శిలీంద్రం ఆశించి వేరు కుళ్లి పోవడం.



నులిపురుగు ఆశించి ఎండిన జామ మొక్క

**పంట నష్టం**

ఈ నులి పురుగులతో ఒక సంవత్సరం నుంచి నాలుగు సంవత్సరాల వరకు జామ తోటల్లో 60-100 శాతం, నర్సరీల్లోనైతే 90-100 శాతం వరకు నష్టం వాటిల్లుతుంది.

**వ్యాప్తి నివారణ చర్యలు**

- నులి పురుగులు లేనివిగా నిర్ధారించబడిన నర్సరీల నుంచి మాత్రమే ఆరోగ్యవంతమైన జామ అంట్లను కొనుగోలు చేయాలి.
- జామ అంట్లు కట్టడానికి, నర్సరీల్లో అంటు మొక్కలను పెంచడానికి నులిపురుగులు లేని స్వచ్ఛమైన మట్టిని వాడుకోవాలి.
- ఆకులు పచ్చబారి, వాడిపోయి వేరుపై బొడిపెలు లాంటివి కలిగి ఉన్న మొక్కలను తోటలో నాటరాదు.

**నర్సరీలో యాజమాన్య పద్ధతులు**

- ఒక టన్ను మట్టిలో 50-100 కిలోల వేప చెక్క పిండి లేదా గానుగ పిండి, జీవ నియంత్రణ కారకాలైన పర్పురియోసిల్లమ్ లిలాసినస్, సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్, ట్రై కోడెర్మా హార్జియానమ్ ఒక్కో కిలో చొప్పున కలిపిన మట్టిని అంట్లు కట్టే ముందు సంచుల్లో నింపాలి.
- కార్బోఫ్యూరాన్ 3జీ లేదా ఫోరేట్ 10జీ 5 కిలోలను ఒక టన్ను మట్టికి కలపాలి.



బుడిపెల్లా మారిన జామ వేర్లు

- నారు మడులను, నారు మొక్కలను పెంచడానికి వాడే మట్టిని వేసవి కాలంలో తెల్లపాలిథీన్ షీటుతో (45-60 రోజులు) కప్పి ఉంచి సోలరైజేషన్ ప్రక్రియ ద్వారా నులి పురుగులను నివారించవచ్చు.
- డయాజోమెట్ గుళికలు ఎకరాకు 60 కిలోల చొప్పున వేసి కలియబెట్టి పాలిథీన్ షీటుతో కప్పి, ఒక వారం ఉంచి తర్వాత షీటును తీసి, మట్టిని తిరిగి కలియబెట్టి 2-3 రోజుల తర్వాత మొక్కలను నాటుకోవాలి. ఈ పద్ధతితో నులిపురుగులను త్వరితగతిలో నివారించవచ్చు.

**తోటల్లో యాజమాన్యం**

- వేసవిలో లోతుగా దక్కలు దున్ని మట్టిని కలియబెట్టాలి.
- కొత్తగా జామ తోటలు వేసే ముందు మట్టిని నులిపురుగులకై పరీక్ష చేయించుకోవాలి.
- నులిపురుగులు ఉన్న భూమిలో మొక్కలు నాటే ముందు జీవనియంత్రణ కారకాలతో సమృద్ధి చేయబడిన వానపాముల ఎరువు లేదా వేప పిండి గుంటకి 5 కిలోల చొప్పున వేసుకుని అంట్లని నాటాలి.
- ఒక టన్ను వానపాముల ఎరువు లేదా పశువుల ఎరువు లేదా వేప పిండిలో 5 కిలోల చొప్పున పర్పూరియోసిల్లమ్ సిలాసినమ్, సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్, ట్రై కోడెర్మా హార్జినియమ్ కలిపి 30 రోజులు ఉంచి సమృద్ధి చేసిన మిశ్రమాన్ని 3-4 కిలోలు ఒక చెట్టుకు 6 నెలల వ్యవధిలో వేయాలి.
- పైన సూచించిన జీవ నియంత్రణ కారకాలతో ఉన్న వేప పిండి లేదా పశువుల ఎరువును 20 కిలోలను 200 లీటర్ల నీటిలో 2 రోజుల పాటు నానబెట్టి 2-3 లీటర్లతో ఒక్కో చెట్టు పాదళ్లు తడిపి నులి పురుగులను నివారించవచ్చు.